క్లుప్తంగా

న్యాయం చేయాలని ఫిర్యాదు

సామర్లకోట: తనతో సహజీవనం చేసిన వ్యక్తి వల్ల ప్రాణహాని ఉందని హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన ఓ మహిళ ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సామర్లకోటకు చెందిన బి.సత్తిబాబు తనతో సుమారు 20 ఏళ్ల సహజీవనం చేశాడని, ప్రస్తుతం తనకు సంబంధం లేదని బెదిరిస్తున్నాడని, న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎ.కృష్ణభగవాన్ తెలిపారు.

ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి


ఎస్సై వెంకటేష్

కొత్తపల్లి: శరన్నవరాత్ర ఉత్సవాల్లో కమిటీ సభ్యులు నిబంధనలను తప్పని సరిగా పాటించాలని ఎస్సై వెంకటేష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అమ్మవారి విగ్రహాల నిమజ్జనానికి సంబంధించి కోనపాపపేట - ఉప్పాడ శివారు సుబ్బంపేట సమీపంలోని రెండు ప్రాంతాల్లో అనుమతి ఉందన్నారు. పూర్తి స్థాయిలో పోలీసుల పర్యవేక్షణలో నిమజ్జనానికి సంబంధించి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో ఎటువంటి అశ్లీల నృత్యాలు ఉండరాదన్నారు. ముఖ్యంగా కమిటీ సభ్యులు పూర్తి బాధ్యత తీసుకుని ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలన్నారు.

కొత్త కార్యవర్గం ఎన్నిక


మండల త్రిరత్న బౌద్ధధమ్మ సొసైటీ సభ్యులు

కరప: వేళంగిలో త్రిరత్న బౌద్ధధమ్మ సొసైటీ వ్యవస్థాపకుడు, ధమ్మాచార్య పొలుగుబాటి నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల త్రిరత్న బౌద్ధధమ్మ సొసైటీ కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల త్రిరత్న బౌద్ధధమ్మ సొసైటీ అధ్యక్షుడిగా మాతా అప్పారావు, ఉపాధ్యక్షుడిగా మారెళ్ల రామకృష్ణ, కార్యదర్శగా సాంబత్తుల రఘువర్మ, ట్రెజరర్‌గా ఇజ్జిన లోవరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సిద్దాబత్తుల అర్జున్, సభ్యులుగా డి.శ్రీనివాసరావు, కె.సూరిబాబు, జెల్లా శివకుమార్, వి.వెంకటేష్, అర్జున్ ఎన్నికయ్యారు. ముందుగా గిడ్ల వరప్రసాద్, సాదే వీరరాఘవులు బుద్ధుని చిత్రపటానికి పూలమాల వేసి బౌద్ధ వందనం చేశారు. సీటీఓ సాంబత్తుల వెంకట్రావు, విశ్రాంత పోలీస్ అధికారి పేరెళ్ల చంద్రరావు, రచయిత సవిలే రాజేష్, జక్కల ప్రసాద్‌బాబు, వినకోటి ధమ్మప్రసాద్, పినిపే నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాక్‌థాన్


పరిసరాల పరిశుభ్రతపై వాక్‌థాన్ చేస్తున్న ఓఎన్జీసీ ఉద్యోగులు

బాలాజీచెరువు: స్వచ్ఛభారత్ వారోత్సవాల్లో భాగంగా ఓఎన్జీసీ ఆధ్వర్యంలో స్థానికంగా వాక్‌థాన్ నిర్వహించారు. తొలుత ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నేష్‌కుమార్, సర్ఫేస్ మేనేజర్ ప్రభల్‌సేన్ గుప్తలు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. రాయుడుపాలెం, ఎస్ఆర్ఎంటీ మాల్, సర్పవరం జంక్షన్ మీదుగా సాగింది. పరిసరాల పరిశుభ్రత పాటించాలంటూ నినాదాలు చేశారు. అన్నవరం సత్యవతీదేవి కళాశాల విద్యార్థులు, ఓఎన్జీసీ ఉద్యోగులు పాల్గొన్నారు. ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు.

పేదలకు చేయూత


విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న బాదం బాలకృష్ణ, ఉదయ్ శ్రీనివాస్

బాలాజీచెరువు: పూర్వ విద్యార్థులంతా కలసి ఏర్పాటు చేసుకున్న రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల చారిటబుల్ ట్రస్ట్ (1978) ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బాదం బాలకృష్ణ అన్నారు. స్థానిక దేవాలయం వీధిలోని కార్యాలయంలో ఆదివారం తొమ్మిది మంది పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఇద్దరు మహిళలకు మూడు నెలలకు సరిపడా మందులు కలిపి సుమారు రూ.2 లక్షల విలువైన సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వీటిని ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి జగన్నాథరావు, సభ్యులు సీమకుర్తి పాపారావు, బోడా ఆనంద్, రామ్‌చరణ్, పద్మనాభం పాల్గొన్నారు.

వైభవంగా బెండపూడి కాగితమ్మ జాతర

తొండంగి: బెండపూడి గ్రామదేవత కాగితమ్మ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామంలోని తూర్పుకాపుల వీధికి చెందిన సుమారు 500 మంది మహిళలు పసుపు చీరలు ధరించి పసుపు నీటి బిందెలతో ఊరేగింపుగా వచ్చారు. గ్రామశివారులో కాగితమ్మ ఆలయంలో అమ్మవారికి అభిషేకించారు. అమ్మవారికి పసుపుకుంకుమ, నైవేద్యాలు సమర్పించారు. గరగ నృత్యాలు, తప్పెటగుళ్ల వంటి సంప్రదాయ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పదండి.. ఓపెన్ స్కూల్‌కు..

- చదువుకోవాలనుకునే వారికి వరం
- రెగ్యులర్ కోర్సులతో సమాన అవకాశం
- అపరాధ రుసుంతో వచ్చే నెల 31 వరకూ అడ్మిషన్లు


సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్


ఓపెన్ స్కూల్ తరగతులకు హాజరైన విద్యార్థులు

సామర్లకోట: చదువుకోవాలనుకునే వారికి ఇదో సదవకాశం.. ఆపేసిన చదువును కొనసాగించాలన్నా.. పదోన్నతులకు అవసరమైన విద్య అభ్యసించాలన్నా ఓపెన్ స్కూల్ ద్వారాలు తెరుకున్నాయి.. ఇది చదువరులకు వరం అయ్యింది. దివంగత నేత, మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో ఓపెన్ స్కూల్ వ్యవస్థను రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించారు. 14 ఏళ్లు నిండి చదువు లేకపోయినా ఓపెన్ స్కూల్‌లో 10వ తరగతిలో చేరే అవకాశం ఇచ్చారు. అయితే ఈ స్కూల్‌లో చేరడానికి తప్పనిసరిగా పుట్టిన తేదీ నిర్ధారణ తప్పనిసరిగా ఉండాలి. ఓపెన్ స్కూల్‌లో పూర్తి చేసిన 10వ తరగతి సర్టిఫికెట్ రెగ్యులర్ విద్యార్థుల కోర్సుతో సమానంగా ఉంటుంది. ప్రస్తుతం ఈ స్కూల్‌లో చేరడానికి రూ.200 అపరాధ రుసుంతో వచ్చే నెల 31 వరకూ అవకాశం ఉంది. అలాగే పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇంటర్‌లో చేరే అవకాశం కూడా ఇచ్చారు. పెద్దాపురం నియోజకవర్గంలో సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్, ప్రభుత్వ హైస్కూల్, పెద్దాపురం మండలం దివిలి, కొండపల్లి జిల్లా పరిషత్తు హైస్కూళ్లలో ఓపెన్ స్కూల్స్ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఓపెన్ స్కూల్ విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేస్తారు. ఇందులో బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఓపెన్ స్కూల్ విజయవంతంగా జరుగుతోంది. దీంతో ఇక్కడ 2011లో ఓపెన్ ఇంటర్ ప్రారంభించారు. ఇంటర్‌లో చేరాలనుకునే విద్యార్థులు తప్పనిసరిగా పదో తరగతి ఉత్తీర్ణత కావాల్సి ఉంటుంది.

తరగతులు ఇలా..

వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పని చేస్తున్న వారికి పదో తరగతి విద్యార్హత లేకపోవడంతో పదోన్నతులు పొందలేక పోతున్నారు. అటువంటి వారు ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి పూర్తి చేస్తే పదోన్నతులు పొందే అవకాశం ఉంటుంది. ఇలా చాలామంది ఓపెన్ స్కూల్‌లో చేరుతున్నారు. ప్రతి ఆదివారంతో పాటు పాఠశాలల సెలవు దినాల్లో ఓపెన్ స్కూల్ తరగతులు నిర్వహిస్తారు. పదో తరగతి తరువాత ఒక సంవత్సరం గడిచిన తరువాత ఇంటర్ రెండు సంవత్సరాల పరీక్షలు ఒకే పర్యాయం పరీక్ష రాసే అవకాశం ఉంది.

చదివా.. పదోన్నతి పొందా..



మున్సిపల్ కార్యాలయంలో 8వ తరగతి విద్యార్హతతో పారిశుధ్య కార్మికుడిగా చేరాను. తదుపరి టౌన్ ప్లానింగ్ చైన్‌మాన్‌గా పని చేశాను. సీనియారిటీ ఉన్నా కనీసం 10వ తరగతి విద్యార్హత లేక చాలాకాలం పదోన్నతి లభించలేదు. దాంతో స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్ పూర్తి చేశాను. దీనివల్ల మున్సిపల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందాను. మాలాంటి వారికి ఓపెన్ స్కూల్ ఓ వరం.

–బంగారు అప్పారావు, మున్సిపల్ ఉద్యోగి, సామర్లకోట

వచ్చే నెలాఖరు వరకూ అవకాశం



ఓపెన్ స్కూల్‌లో చేరడానికి అడ్మిషన్ ఫీజు రూ.200 అపరాధ రుసుంతో అక్టోబర్ 31 వరకూ చెల్లించవచ్చని గడువు పెంచుతూ విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ప్రవేశ రుసుం జనరల్ అభ్యర్థులకు రూ.1,300, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.900 చెల్లించాలి. ఇప్పటి వరకూ ఓపెన్ స్కూల్ 10వ తరగతిలో 1,064 మంది, ఇంటర్‌లో 566 మంది చదివారు.

–తోటకూర సాయిరామకృష్ణ, బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్

హిందూ ధర్మానికి ప్రతిరూపం బొమ్మల కొలువు


ఆకట్టుకున్న బొమ్మల కొలువు

బోట్‌క్లబ్: దసరా ఉత్సవాల సందర్భంగా బొమ్మలు కొలువు నిర్వహించడం ద్వారా హిందూ ధర్మంలోని విశేషాలను నేటి తరానికి సజీవంగా చూపించవచ్చని వేద పండితుడు యాతగిరి మద్వేష్ అన్నారు. స్థానిక ప్రగతి కాలేజీ సమీపాన మనోజ్ఞ మనోహర్ స్వగృహంలో ఏర్పాటు చేసిన దసరా బొమ్మల కొలువును ఆయన సందర్శించారు. బొమ్మల కొలువు ద్వారా అనేక ఆధ్యాత్మిక విషయాలు పిల్లలకు వివరించడం అద్భుతమన్నారు. మనోహర్ మాట్లాడుతూ పండరీపురం క్షేత్రాన్ని, దాని పరిసరాలలో ఉన్న మధ్వమత గురువుల విశేషాలతోపాటు, శ్రీపాండురంగ స్వామి భక్తుల విశేషాలను ప్రతిబింబించే విధంగా బొమ్మలు ఏర్పాటు చేశామన్నారు. పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వడమే కాక, గ్రామీణ వాతావరణం చూసేలా ధాన్యంతో కూడిన ఎడ్ల నమూనాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ బొమ్మలు కొలువును చూసి వాటిలోనే విశేషాలను తెలుసుకుంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు.

బోరు నీరు.. వృథా తీరు


బలుసులపేటలో రోడ్డుపైకి విడిచి పెడుతున్న బోరు నీరు

సామర్లకోట: గొంతు తడాల్సిన నీరు వృథా అవుతోంది.. అధికారుల నిర్లక్ష్యం కారణంగా జలం రోడ్డెక్కుతోంది.. స్థానిక నీలమ్మ చెరువు గట్టుపై ఉన్న బోరు నీటిని టెస్టింగ్ పేరుతో బలుసులపేట రోడ్డుపై విడిచి పెడుతున్నారు. దీనితో అటుగా వెళ్లేవారు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డుపైకి విడిచి పెట్టే నీటిని నీలమ్మ చెరువులోకి ఎందుకు విడవడం లేదని 13వ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ డీఈ దృష్టికి తీసుకు వెళ్లినా స్పందన లేదని అన్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వర్గీకరణ అమలు పర్యవేక్షణ బాధ్యత అందరిదీ

తుని రూరల్: ఎస్సీ వర్గీకరణ అమలు అవుతుందో లేదో పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి మాదిగ సోదరుడిపై ఉందని జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పలివెల శివమణి పేర్కొన్నారు. ఆదివారం తుని మండలం లోవకొత్తూరులో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య అక్టోబరు 6న జిల్లాలో పర్యటిస్తున్నారని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. త్వరలో అన్నవరంలో నిర్వహించనున్న దండోర మహాసభను జయప్రదం చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ సక్రమంగా అమలు జరుగుతుందో లేదో ఎప్పటికప్పు ప్రతిఒక్కరు పర్యవేక్షించినప్పుడే ఫలితాలు లభిస్తాయన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం మాదిగలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు పలివెల రవి అనంతకుమార్ పాల్గొన్నారు.

మూఢాచారాలకు వ్యతిరేకంగా రచనలు

బోట్‌క్లబ్: సామాజిక ప్రయోజనాలు ఆశించి గుర్రం జాషువా రచనలు చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. స్థానిక సత్కళా వాహినిలో ఆదివారం గుర్రం జాషువా జయంతి వేడుకలు నిర్వహించారు. కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని మూఢాచారాలపై తిరగబడ్డారన్నారు. ఈ సందర్భంగా వేదుల శ్రీనివాసశర్మ, ఈవీ కృష్ణమాచార్యులు, కె.దుర్గాప్రసాద్ అవధానితో పాటు పలువురు కవులు గుర్రం జాషువా సాహిత్యాన్ని వివరించారు. అనంతరం కవులను సత్కరించారు. కార్యక్రమంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు యార్లగడ్డ రామ్‌కుమార్, పైడా భవనప్రసాద్, మాలకొండయ్య, పెద్దిరెడ్డి రవికిరణ్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి


పెద్దాపురంలో భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పెద్దాపురం: స్వాతంత్ర్య పోరాట యోధుడు భగత్‌సింగ్, సామాజిక రచయిత, కవి కోకిల గుర్రం జాషువాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు జోషుల కృష్ణబాబు పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నువ్వుల గుంట వీధి భగత్‌సింగ్ విగ్రహం వద్ద భగత్‌సింగ్ జయంతి, స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనం వద్ద జాషువా జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహానుభావులు దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను త్యాగం చేశారన్నారు. ఆ కోవలోనే భగత్‌సింగ్ యువతలో స్ఫూర్తిని నింపారన్నారు. సామాజిక అసమానతలను పారద్రోలేందుకు కవి జాషువా ప్రయత్నించారన్నారు. ఆయన రచించిన అనేక ఖండ కావ్యాలు, పద్యాలు, కవితలు నేటికీ చిరస్థాయిగా నిలిచాయన్నారు. భగత్‌సింగ్ విగ్రహానికి, జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఎస్ఎం నాయకులు రొంగల వీర్రాజు, దారపురెడ్డి కృష్ణ, సత్యనారాయణ, బంగార్రాజు, గూనిరి రమణ, వడ్డి సత్యనారాయణ, కూనిరెడ్డి అప్పన్న, సిరిపురపు శ్రీనివాస్, పీసీసీ అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ, అనూష అంజలి, జశ్విత, నాని పవన్, కుమార్, మణికంఠ, బంగారం, సందీప్, హర్ష, చల్లా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం


అభినందన సభలో మాట్లాడుతున్న ఆర్జేడీ నాగమణి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): స్థానిక శ్రీనగర్ ఆదిత్య అకాడమీలో ఆదివారం డీఎస్సీ–25 విజేతలకు సత్కార సభ నిర్వహించారు. కాంపిటేటివ్ విభాగ డైరెక్టర్ డీఎన్ గణేష్ అధ్యక్షతన నిర్వహించిన సభలో పాఠశాల ఆర్జేడీ నాగమణి హాజరై మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులు కృషి చేయాలని, ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎదిగి మంచి పేరు సంపాదించాలని సూచించారు. ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సత్కరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాకినాడ క్రైం: కాకినాడకు చెందిన ఓ వ్యక్తి రైలు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందాడు. రేచర్లపేటకు చెందిన కంచుమర్తి దినకర్ (32) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. భార్యతో మనస్పర్థల కారణంగా మూడేళ్లుగా ఆమెకు దూరంగా ఉంటున్నాడు. శనివారం రాత్రి రేచర్లపేట సమీపంలో రైలు పట్టాలు దాటుతూ ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాల పాలవ్వగా స్థానికులు గమనించి కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. కాకినాడ జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేశారు.

సింహ వాహిని.. సుమధుర హాసిని

- వైభవంగా శరన్నవరాత్ర ఉత్సవాలు
- ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు


సామర్లకోటలో కనకదుర్గమ్మ వారి చీర, సారెతో ఊరేగింపు


సామర్లకోటలో చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు


పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో భజనలు చేస్తున్న భక్తులు


సామర్లకోట పంచారామ క్షేత్రంలో మహాలక్ష్మిగా అమ్మవారు

సామర్లకోట: శక్తి రూపిణిలా.. సుమధుర హాసినిలా కొలువుదీరిన ఆ కనక దుర్గమ్మను భక్తులు ఆరాధించారు. శరన్నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని జగన్మాత వివిధ రూపాల్లో దర్శనమిస్తున్నారు.. సామర్లకోట పంచారామ క్షేత్రంలో వేంచేసి ఉన్న స్వామివారి దేవేరి బాలాత్రిపుర సుందరీదేవి ఆదివారం షష్ఠిని పురస్కరించుకుని మహాలక్ష్మి రూపంలో అలంకృతులయ్యారు. ఈ నెల 22 నుంచి శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు రోజూ ఒక అవతారంలో భక్తులకు దర్శనం ఇస్తున్నారు. ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో రూ.1.50 లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు. ఉదయం స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, శ్రీచక్ర నవవర్ణార్చన, సహస్ర గులాబీ అర్చన, దర్బారు సేవ, బాలా పరమేశ్వరీ మంత్రజపం నిర్వహించారు. మహిషాసుర మర్ధిని అమ్మవారి ఆలయం వద్ద గణపతి హోమం, రుద్రహోమం, సహస్ర చండీ హోమం జరిగాయి. అమ్మవారిని బంగారు కిరీటం, బంగారు ఆభరణాలతో, కుమారారామ భీమేశ్వరస్వామిని వెండి ఆభరణాలు, పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజ్‌గోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకటరమణ, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్‌లు పూజాదికాలు నిర్వహించారు. అదే విధంగా అయోధ్య రామపురంలోని కనకదుర్గమ్మ ఆలయం, సత్తెమ్మ తల్లి ఆలయం, బడేలమ్మ చెరువు వద్ద నవదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

కనకదుర్గమ్మకు సారె సమర్పణ


సామర్లకోట పాత్రుళ్ల వీధిలో వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ వారికి చీర, సారె సమర్పణ కార్యక్రమం నేత్రపర్వంగా జరిగింది. 25 ఏళ్లుగా పాత్రుళ్ల వీధిలోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహించడంతో చీర, సారెతో పురవీధుల్లో ఊరేగించారు. ఆ ప్రాంతంలోని ప్రతి ఇంటి నుంచి ఒక మహిళ పాల్గొని జాకెట్టు ముక్కలు, చీర, పండ్లు, పువ్వులు, మిఠాయిలు సుమారు 300 మంది మహిళలు తీసుకు వచ్చారు. బ్యాండ్ మేళం, యువత నృత్యాలతో ఆలయానికి చేరుకుని సారె సమర్పించారు. ఈ మేరకు ఆలయ పండితులు ప్రత్యేక పూజలు చేశారు. తొలుత కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అయ్యారక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి దంపతులు ప్రారంభించారు. ఆలయ కమిటీ నాయకులు పెదిరెడ్ల కృష్ణ, బొడుగు ప్రసాద్, కర్రి నారాయణ, కర్రి ఉమామహేశ్వరరావు, కర్రి రామకృష్ణ, ఎలిశెట్టి శివాజీలు భక్తులకు సేవలందించారు. అదే విధంగా సీతాఫలదొడ్డి ఆలయంలో పూజలు చేశారు.

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ, కాండ్రకోట నూకాలమ్మ అమ్మవార్లు మహా చండీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల ఈఓలు విజయలక్ష్మి, రాంబాబురెడ్డి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పిఠాపురం: దసరా ఉత్సవాల్లో ఏడో రోజు పిఠాపురం పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరీదేవి అమ్మవారు వాగ్దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పదో శక్తి పీఠం పూరుహూతికా అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు జరిపారు. తాటిపర్తిలో అపర్ణాదేవి అమ్మవారిని మహాచండిగా అలంకరించారు. ఆలయంలో నిర్వహించిన బొమ్మల కొలువు భక్తులను ఆకట్టుకుంది. పలువురు మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. దుర్గాడ శివాలయంలో లలితా మాత మహాలక్ష్మిగా, పిఠాపురం మహాలక్ష్మి అమ్మవారు మోహిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

కొత్తపల్లి: స్థానిక శ్రీధర్మశాస్త్రా ఆలయంలో కనకదుర్గమ్మ వారికి ప్రత్యేక పూజలు చేసి, భజనలు ఆలపించారు. గాదులదొడ్డిలోని బాల కనకదుర్గమ్మ ఆలయం వద్ద భవానీలు కుంకుమార్చనలు చేశారు. గోర్సలో కనకదుర్గమ్మ ఆలయం వద్ద కోలాటం నిర్వహించారు. కొమరగిరిలో బాల కనకదుర్గాదేవి సంతానలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. మండలంలోని వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.


పెద్దాపురంలో మహాచండీ దేవిగా నూకాలమ్మ


పాదగయ క్షేత్రంలో వాగ్దేవిగా రాజరాజేశ్వరీదేవి


ప్రత్యేక అలంకరణలో పురుహూతికా అమ్మవారు


చండీ అవతారంలో తాటిపర్తి అపర్ణాదేవి


మోహినిగా పిఠాపురం మహాలక్ష్మీదేవి


మహాలక్ష్మి స్వరూపిణిగా దుర్గాడ లలితాదేవి


కొమరగిరిలో సంతాన లక్ష్మీదేవిగా అమ్మవారు


కొత్తపల్లి గాదులదొడ్డిలో భవానీ భక్తుల కుంకుమ పూజలు